# సత్యాగ్రహం

"ప్రియా! పెసరట్లేస్తున్నావా? బాగా ఉల్లి, మిర్చి, అల్లం తగిలించి డబుల్ రోస్ట్ చెయ్యి!" యెనిమిది గంటలకి సావకాశంగా లేచి పళ్ళుతోమి వంటింట్లో ప్రవేశించి అన్నాడు కృష్ణమూర్తి.

"అదిగో అలా పిలవద్దన్నానా?" పెసరట్లు వేస్తున్న ప్రియంవద కోపం నటించింది.

"ఏం పిలిస్తే? నా పెళ్ళాన్ని నా ఇష్టంవచ్చినట్లు పిలుచుకుంటాను! మధ్య నీకేం వచ్చింది?"

"ఆ పెళ్ళాన్ని నేనే గాబట్టి నాకే వచ్చింది! ప్రియా! యేమిటి? నాటకాల్లో బుంగమీసాలు, గంపగిరజాల వాళ్ళూ పిలచినట్టు! పిలిస్తే సరిగా పిలవండి పూర్తి పేరు పెట్టి. లేకపోతే అసలు వద్దు! ...అదలా వుంచి, హోటల్లో సర్వర్ కి ఆర్డరు ఇచ్చినట్లు ఏమిటా చెప్పడం?"

"అలవాటయిపోయింది! అయిదేళ్ళ సాంగత్యదోషం. యివాళ ఓ పెళ్ళాం వచ్చిందని ఒక్కసారిగా వదిలిపొమ్మంటే పోతుందా?"

"చాల్లెండి! మీతో మాట్లాడుతూ కూర్చుంటే పని అయినట్లే! వెళ్ళండిక్కడ్నించి!" నవ్వి నుదుటపడ్డ చిరు నెంట్రుకలు మోచేత్తో తోసుకుంటూ కాఫీ కప్పు అందించింది ప్రియంవద.

"ఆ!... ఆ!... అలా వుండనీ!... అలాగే బాగుంటావు!" కొంపమునిగినట్లు గాబరాగా వారించాడు కృష్ణమూర్తి.

"అబ్బ!... హడలిపోయాను ఏమిటో అనుకుని! ఇంతా చేసి కథల్లో రసికత్వమా!... సంతోషించాంగాని ఇదిగో, మీకు పెసరట్లు కావాలంటే బుదిగా డైనింగ్ టేబిల్ ముందు కూర్చోండి ఇలా వచ్చి మాటల్తో నా పని చెడగొడితే నావల్లగాదు చెయ్యడం. వెళ్ళండిక్కణ్ణుంచి!"

"అబ్బే! అదేం కుదరదు. పెసరట్లు అలా పెనం మీంచి ఇలా ప్లేటులో పడ్తూంటే ఎన్ని వేసిందీ నీకు తెలియకుండా, నేనెన్ని తిన్నదీ నాకు తెలియకుండా తింటూంటే, అందులోనే వుంది అందం, ఆనందం. టేబిల్ దగ్గిర కూర్చుని ఎవడో వూర్లోవాడిలాగ లెక్క పెట్టి మర్యాదకి మొహమాటపడ్తూ తినే ఖర్మ నాకేం పట్టింది?... ఊ... రానీ వరస!" ఓ మోడా లాక్కుని కూర్చుంటూ ప్లేటులో అల్లం పచ్చడి వేసుకున్నాడు కృష్ణమూర్తి.

"ఉత్త తిండిపోతు!" కొంటెగా నవ్వింది ప్రియంవద.

"అపచారం! లెంపలేసుకో! కళ్ళు పోతాయి. మొగుణ్ణి పట్టుకుని అలాంటి మాటలన్నావంటే! పతివ్రతా లక్షణాలు అసలు లేవు సరిగదా, మొగాడు, మొగుడు అన్న గౌరవం, భక్తి కంచుకాగడా వేసి వెతికినా కనపడకుండా పోయింది! అబలలు, అసహాయులు అని కాస్త అలుసిస్తే నెత్తికెక్కి తొక్కే రకం మీ ఆడజాతి! అందుకే బుద్ధిమంతులు

మన తాత ముత్తాతలు ఆడది వుండాల్సిన చోటు ఇదీ అని ఓ గిరిగీసి అందులో కూర్చోపెట్టారు! ఏదోపోనీ, సమానత్వమో, సమానహక్కులో అంటూ ఫూరికే ఇదవుతున్నారు గదా అని జాలిపడితే, మొగుడ్ని పట్టుకుని ఎంత మాటపడితే అంత అనేవరకు వచ్చింది ..."

"ఆపండింక ఉపన్యాసం ! ఇదో పెద్ద ఫేషన్ అయిపోయింది ఈ మగాళ్ళకి ఈమధ్య ! సమానత్వం ఇస్తున్నాం, సమానహక్కులు ఇచ్చాం, ఉద్ధరిస్తున్నాం, ఊరేగిస్తున్నాం ! ... అని బుజాలు చరుచుకోవడం! మీరేం మమ్మల్ని ఉద్ధరించక్కరలేదు, ఊరేగించనూవద్దు. మా దారిన మమ్మల్ని పోని స్తేచాలు! కాబట్టి మహాశయా! పెద్ద స్త్రీ జనోద్ధారకులలాగ పెద్ద ఫోజులు పెట్టకండి! ... అన్నట్టు, హక్కులు, గిక్కులు అంటే జ్ఞాపకం వచ్చింది సాయంత్రం మా "నారీ సంఘసదన్"లో అత్యావసర సమావేశం వుంది. నే వెళ్ళాలి! ... వచ్చేసరికి లేటవచ్చు. తమరు డూప్లికేట్ తాళం వుంచుకోడం మంచిది!"

"ఏమిటో ఆ అత్యావసర సమావేశం! బీహారు కరువు వెనకట్టిందే ? వరదలుకూడా లేవే ? ! ... అటు పాకిస్తాన్ వాడు, ఇటు చీనావాడుకూడా బుద్ధిగానే వున్నారు. మొరార్జీదేశాయి మిగిలిన బంగారంకూడ ఒలిచి ఇచ్చేయమనలేదు! ఇంకెందుకో యీ అత్యావసర సమావేశం" కృష్ణమూర్తి సావకాశంగా పెసరట్లు సేవిస్తూ విట్లు వేయసాగాడు.

"మీకంత వేళాకోళంగా వుందన్నమాట మా 'నారీ సంఘం' అంటే! ఈ మధ్య బీహారు క్షామనిధికి మేము పాతిక వేలు పోగుచేసి పంపలేదా ? ఆ మధ్య రక్షణనిధికి యింటింటా తిరిగి ఎంత వసూలు చేశాం! ఆ మధ్య బంగారం కావాలంటే....!"

"ఆఁ.. చాలు ఈ ... మధ్యలు, ఆ మధ్యలు ! మధ్య మధ్య ఈ పెసరట్ల ప్రియుడిని గుర్తుంచుకోమని మనవి! ... యింతకీ తమరు సాయంత్రం తమ మండలికి వేంచేస్తారన్న మాట. అయితే మేము రోజూ కంటె మరో రెండు గంటలు క్లబ్బులో వుండడానికి అనుమతి అయాచితంగా లభించిందన్నమాట !"

"ఆహా! పెద్ద-భార్యా విధేయుడిలాగ ఇదో వేషం! ఎవరన్నా వింటే మిమ్మల్ని కొంగుకి ముడివేసుకున్నా ననుకోడానికి! అది సరేగాని పేకాటలో యథాప్రకారం చేతులు కాల్చుకుని పెళ్ళామనే ఓ అభాగిని రిక్షాలు, టాక్సీలులాంటి పదార్థాలేవి దొరకనిచోట యింటికి చేరే విధానమేదని బిక్కు-బిక్కుమంటూ ఎదురుచూస్తూంటుందన్న సంగతి మర్చిపోక కాస్త అలా వచ్చి నన్ను పిక్ చేయండి... అవును, ఇంక లేచేదేమన్నా వుందా లేదా ? అలా ఒకటి తరువాత యింకోటి లాగించేస్తున్నారు. ఆరయ్యాయి ఇప్పటికి !" నవ్వుతూ గుర్తుచేసింది ప్రియంవద.

"ఏదో అన్నపూర్ణ అంటారు మూడు. అలాంటి చేతితో నువ్వు నలుడు, భీముడు ఇంకా వాళ్ళ అన్నయ్యలు అంతా

జాయింటుగా అసూయపడేట్టున్న యీ నేతి పెసరట్లు వేస్తూంటే..."

"ఇంక అబ్బాయిగారు పొగిడి సాధించేదేం లేదు ! లేవాల్సిందే యివాళకి !"

కృష్ణమూర్తి బలవంతంగా లేచాడు.

* * *

ఆ రోజు సాయంత్రం ఆరుగంటలకల్లా 'నారీ సంఘ సదన్' అంతా రకరకాల చీరలతో, రకరకాల సైజు మనుష్యులతో కలకల్లాడుతూంది. అందరూ యెవరి మట్టుకువారే ఆ నారీ సంఘం బరువు, బాధ్యత అంతా తమ భుజాలపై వున్నట్టు మహా బిజీగా దేనికోసమో కంగారు కంగారుగా తిరిగేస్తున్నారు.

అసలు యీ అర్థాంతపు సమావేశం యెందుకో అసలు కొంతమంది ముఖ్యులకి తప్ప తెలియనే తెలియదు. ఎవరికి తోచిన అభిప్రాయాలు వారు వెలిబుచ్చుకుంటూ కార్యదర్శిని, అధ్యక్షురాల రాకకోసం ఆత్రుతగా యెదురు చూడసాగారు.

కాసేపటికి వాళ్ళు రావటం అయింది. పరామర్శలు, కుశలప్రశ్నలు, మామూలు సంబోధనలు అన్నీ అయ్యాక సెక్రటరీ శారదాదేవి, అధ్యక్షురాలు రాణి విమలాదేవి ఇద్దరూ తమ ఆసనాల్లో అధిష్టించారు. అందరూ ఎవరికి అందిన ఆసనాల్లో వారు కూర్చున్నాక, సావకాశంగా లేచి, గొంతు సవరించుకుని ఆరంభించింది సెక్రటరీ శారదాదేవి.

"సోదరీమణులారా !

ఈనాడు యీ అత్యవసర సమావేశం యెందుకు జరుగుతోందో మీలో చాలమందికి తెలిసివుండకపోవచ్చు. ఈ సమావేశంలోని అంశం అందరికీ తెలిసినటువంటిదే ! మామూలు సమస్యే ! ఈ సమస్య యెన్నిసార్లు, యెన్ని చోట్ల, యెన్ని సభలు, సమావేశాలూ, చర్చలు, తీర్మానాలు, సమాజాలు, సంఘాలద్వారా పరిశీలించినా, పరిష్కరించబోయినా తేలని సమస్య ! దీనికొక పరిమితి, అంతం, అంటూ కనపడక యిదొక నిత్య పోరాటంగా రూపు దాల్చడం మూలాన్నే మళ్ళీ మళ్ళీ మనం ఇలా సమావేశాలు అవుతూండడం, మళ్ళీ మళ్ళీ కార్యాచరణకి పూనుకోవడం, చర్విత చరణం అన్నట్లు యెన్నిసార్లో యెంతో మంది చెప్పిన మాటల్నే పునశ్చరణ చేసుకోవడం జరుగుతూంది. ఇది మన దౌర్భాగ్యం ! ఈ దేశంలో, ఈ మనుషులమధ్య, ఈ వాతావరణంలో యీ దౌర్భాగ్యం మనకి పట్టింది. ఇది మనం కోరి తెచ్చుకున్నదిగాదు, మనం వాంఛించింది కాదు ! ఇది మనమీద రుద్దబడింది. కాబట్టి ఈ ఇబ్బంది మనం ఎలాగో భరించి, ఇవాళ ఇక్కడ సమావేశం అయి, చాలమంది చాలచోట్ల చాలసార్లు చెప్పిన మాటల్నే మళ్ళీ చెప్పుకుని, మన పరిస్థితి పరిశీలించి, క్రొత్తమార్గమేదన్నా వుందేమో ఆలోచించాలి

"ప్రకృతి స్త్రీ, పురుషుల్ని సమానంగానే సృష్టించింది. కాని మగవాడు, డబ్బున్నవాడు ప్రభుత్వాన్ని చేపట్టి న్యాయసూత్రాలు, ధర్మసూత్రాలు తయారుచేసి పేద

వాళ్ళని అణగద్రొక్కినట్టు, రకరకాల శాస్త్రాలు, స్మృతులు, కోడ్‌లు తయారుచేసి ఆడదాన్ని అబల అని, సుకుమారి అని వర్ణించి, వంట చెయ్యమనీ, పక్కలు వేయమని, చాకలి పద్దులు వ్రాయమని, పిల్లల్ని కని పెంచమని, ఊరగాయలు పెట్టమని, కుట్టు అల్లికలు చూసుకోమని, అంతకుమించి దేనికీ పనికిరారని ఏకపక్షంగా నిర్ణయంచేసి కూర్చొపెట్టాడు. కొన్నిచోట్ల తమ పని సాగించుకోవడానికి ఆడది సౌందర్య స్వరూపిణి క్షమ, ఓర్పుగలదని, సుకుమారి అని పొగిడి, ఈ గుణాలన్నింటివల్లా కూడా ఆమె, యింటి నాలుగు గోడల మధ్య ఉండాలని సిద్ధాంతీకరించారు. ఇదంతా చూస్తే తమాషాగా వుంటుంది, నవ్వొస్తుంది ! ఏడవలేని నవ్వు !

"ఈ మగాళ్ళ ఉక్కు పంజరాల్లాంటి సిద్ధాంతాలలో బంధింపబడి శుష్కించిన స్త్రీ చాలాకాలం వీటిని, ఈ దిక్కుమాలిన స్వార్థపూరితమైన నమ్మకాలని తను అనుసరించింది. గుమ్మం దిగితే పాపమనుకుంది. భర్తకి యెదురు తిరిగితే నరకమని, భర్త యెలాంటి వాడైనాసరే అతని తోటిదే మోక్షమని, స్వర్గమనీ నమ్మింది. అతని కాళ్ళు పట్టింది, కాళ్ళు కడిగి నెత్తిన జల్లుకుంది. అతను నీచమైన దుర్వ్యసనాలకి అలవాటుపడి హింసిస్తే నోరెత్తకుండా భరించింది. పైగా అతనే ప్రత్యక్షదైవమని, అతనేం చేసినా దైవ ప్రసాదమని స్వీకరించింది, చివరకి అతనుచస్తే అతనితో పాటు తనూ మంటల్లో మగ్గింది. ఆ తర్వాత ఆ ఆచారం పోయినా అంతకంటే హీనమైన నికృష్టమైన జీవితం గడి

పారు పతిపోయిన స్త్రీలు. పదేళ్ళకి పెళ్ళిచేసి, పన్నెండేళ్ళకి వితంతువయితే గుండుచేసి, సైను పంచ చుట్టబెట్టి స్నానాలు పూజలు చేయాలని, ఉప్పుడు పిండి తిని పడుండా అని శాసించి రాచి రంపాన పెట్టారు, ఆనాటి వితంతు స్త్రీలని. ఈనాటికీ పతిపోయిన స్త్రీలకి మన సమాజంలో ఎటువంటి స్థానం వుందో అందరికీ తెలుసు !

“ఇదంతా వింటూంటే విూకెలావుంది! యెంతపాపం చేసుకు పుట్టామో యిలా ఆడవాళ్ళుగా అనిపిస్తూందా ? అదే పనికి రాదంటున్నాను. ఈనాడు స్త్రీ, మగాడు పుక్కిట పురాణాల పేరిట, దిక్కుమాలిన ధర్మసూత్రాల పేరిట తన కళ్ళకి గట్టిన గంతల్ని విప్పుకుంది. ఈ రోజు పురుషుడి గుప్పిటలో కీలుబొమ్మగా ఉండడం సహించదు. ఈ రోజు కొద్దికొద్దిగా ఈ ఉక్కు పంజరాల ఊచలు విరుగుతున్నాయి. బయటి గాలులు వీస్తున్నాయి. స్త్రీ కాస్త ఊపిరి తీసుకుంటూంది. ఆమె మనస్సు మూత తెరచుకుని స్వేచ్ఛగా ఆలోచించగల్గుతోంది. మంచికి చెడుకీ మధ్య, సత్యానికీ అసత్యానికి మధ్య, నీతికి అవినీతికి మధ్య, న్యాయానికి అన్యాయానికి మధ్య సన్నని గీత చూడగలుగుతూంది.

“కాని అంతటితో కథ ముగియలేదు. ఇంకా ఎంతో మిగిలిపోయింది. తరతరాలుగా జీర్ణించుకుపోయిన స్వార్థం మగాడి పేగుల్ని వదలలేదు. పురుషుడి కబంధహస్తం స్త్రీ గొంతుని వదిలినా ఇంకా ఎంతో దూరం పోలేదు. ఆ అహం ఇంకా చావలేదు. ఈనాడు మగవాడు రాజ్యాలు పోయిన రాజుల్లా చేతకాని వాడి కోపంతో కారాలు మిరి

యాలు నూరుతూనే వున్నాడు. ఇంకా ఎలాగైనా ఆధిక్యం తన దేననిపించుకోవాలనుకుంటూనే వున్నాడు. ఇంకా ఎప్పటికో మళ్ళీ ఆ పాత కథ పునరావృతం చెయ్యాలని కలలుగంటున్నాడు. అందుకే ఆడది చదువుకుంటున్నదన్నా, ఉద్యోగం చేస్తున్నదన్నా యీ అసహనం, ఇలా ఉడుక్కోడం, ఇలా కళ్ళల్లో నిప్పులు పోసుకోవడం! అయినా మనం జడవం. తాటాకుల చప్పుళ్ళకి కుందేళ్ళు జడవవు! అలాగ యీ మగాళ్ళ పాతపాటలకి మనం లొంగి వశంకాము. మనకి ప్రకృతి ఇచ్చిన స్థానాన్ని మనం సాధించుకుంటాం. మన హక్కులు మనకి దొరికిందాక విశ్రమించం.

“వీళ్ళు చిత్రించే, దద్దమ్మలం కాదని నిరూపిద్దాం. స్త్రీని గౌరవించడం పురుషులకి నేర్పుదాం. తమలాగే ఆడదీ ఓ రక్తమాంసాల్తో మానవత మూర్తీభవించిన మనిషి అనీ, తమకంటె ఏ విషయంలోనూ తక్కువ గాదని వాళ్ళకి తెలియ చెపుదాం. అందుకు మనం అందరం ఒకే మాట మీద నిలబడాలి. అందుకు మీ అందరి సహకారం కావాలి. ఇది ఏ ఒక్కరివల్ల అయ్యే పనిగాదు. ఇది ఒక్కరి సమస్య కాదు! మొత్తం స్త్రీ జాతి సమస్య! అంచేత మనంఅంతా ఈరోజు విషయం చర్చించి కర్తవ్యం నిర్ణయించుకోవాలి. ముందు కార్యక్రమం మీకే వదులుతున్నాను. మీలో ఎవరైనా సరే ముందుకు వచ్చి మీ మీ అభిప్రాయాలు తెలిపి యేం చెయ్యాలో సూచిస్తారని ఆశిస్తాను!”

కొంచెంసేపు ఆవేశంగా, కొంతసేపు జాలిగా, వ్యంగ్యంగా ఉపన్యసించిన శారదాదేవి, ఓ గ్లాసుడు మంచి నీరు త్రాగి కూర్చుంది.

"ఏమిటంటుంది యీావిడ ? మనం దేనికోసం దెబ్బ లాడాలంటారు ? బియ్యంకోసమా ?" కాస్త చెముడున్న సుబ్బలక్ష్మి ప్రక్కనున్న అంబుజమ్మ నడిగింది.

"బియ్యమూ కాదూ ! బొగ్గులూకాదూ! హక్కులు, మగాళ్ళతో సమాన హక్కులకోసం !" ఆమె అజ్ఞానాంధ కారానికి జాలిపడుతూ గట్టిగా జవాబిచ్చింది అంబుజమ్మ.

"హక్కులు, బుక్కులు ఎందుకమ్మా ! ఆ దెబ్బ లాడేది గవర్నమెంటు వాళ్ళతో బియ్యానికో పంచదార కోసమో అయితే కాస్త ఫలమైనా దక్కుతుంది. ఈ హక్కులు ఏం చేసుకుంటాం! దానికోసం మగాళ్ళతో మనకి దెబ్బలాట ఒహటా ?"

'ష్ !' అన్నారెవరో. ఈ పదో శతాబ్దపు అడివి మనిషి ఎవరన్నట్టు వింతగా చూశారు వెనక్కి తిరిగి కొందరు.

ఈ మధ్యలో ఉపన్యసించడానికి వేదిక చేరిన ఊర్మిళ ఈ అవకాశాన్ని జారవిడవకుండా బిగించి పట్టుకుని ఉపక్ర మించింది.

"ఇదిగో !...ఇలాంటి అమాయకులం మనం! అందుకే ఇన్నాళ్ళుగా మనని అణిచిపెట్టి మన పురోగమనానికి అడ్డు రాగలిగారు పురుషులు ! కాని, ఇవాళ మనలో సుబ్బలక్ష్మ మ్మలు, నరసమ్మలుకన్నా, సునీతలు, సుచరితలు, సుప్రియలు

యెక్కువ. చివరకి, రోజులు మారాయి మన విషయం లోనూ, ఇదివరకులాగ చదువు సంధ్యలు లేకుండా ఏం తెలీని మూర్ఖురాలు కాదు స్త్రీ ఈనాడు! కేవలం వీధి పాచి, యింటి చాకిరి చేసుకుంటూ, మగాడి అవసరాలు తీరుస్తూ పిల్లల్ని కనే యంత్రం కాదు యీనాడు ఆడది! ఆడవాళ్ళ హక్కులుకోసం కూడా మగాళ్ళే పోరాడాల్సిన దౌర్భాగ్య స్థితిలో లేదు యీ నాడు స్త్రీ! పురుషుల్ని యాచించి, మన హక్కులను సంపాదించాలనే ఆలోచన మనకి రాగూడదు! ఇవ్వడం, ఇవ్వకపోవడం వాళ్ళ ఇష్టా ఇష్టాలమీద ఆధారపడిలేదు, సాధించుకునేది మనం! ఎలా సాధించాలి అన్నది మనం యిప్పుడు ఆలోచించాలి.

"దానికి ముందు ప్రస్తుతం పురుషుల దృష్టిలో స్త్రీలకి ఏమాత్రం గౌరవాదరాలు లభిస్తున్నాయన్నది మనం చూద్దాం! ఒకసారి సమకాలీన సంఘ పరిస్థితులు పరిశీలిద్దాం!

"యీనాడు ఆడదనగానే అప్పడాల కర్రతో చిత్రిస్తున్నారు చిత్రకారులు. ఆడదాన్ని గయ్యాళిగా, రాక్షసిగా బొమ్మలలో చిత్రించి సంతోషించాల్సిందేగాని, నిజానికి మన మంటే పోనీ అలాగైనా భయం, వినయం వాళ్ళకి లేవన్న సంగతి వాళ్ళకీ తెలుసు! ఆడవాళ్ళనగానే కూరేం వండారు, చీరెంత- మొదలైన అమ్మమ్మ కబుర్లు చెప్పుకోవడానికి తప్ప దేనికీ పనికిరాని కార్యశూన్యులు అన్న తేలిక అభిప్రాయం వాళ్ళలో పాతుకుపోయింది. మన క్లబ్బులు, మహిళా మండలులు, మన సమాజాలు ఏదో కాలక్షేపానికీ,

పోచికోలు కబుర్లు చెప్పుకోవడానికి అని వాళ్ళ ఉద్దేశం! మన ఆయుధం కన్నీళ్ళని, దాంతోనే వాళ్ళని లోబరుచుకుంటున్నామని, ఏడవడం మినహా ఇంకే చాతకాదని వాళ్ళ అభిప్రాయం! అందుకు పాపం, మనమీద జాలిపడి మన కేదో ఉద్ధరిస్తున్నామని, సంస్కరిస్తున్నామని గప్పాలు చెప్పుకుంటున్నారు.! చెప్పుకుని తమ హృదయ వైశాల్యాన్ని చాటుకుంటూ, వాళ్ళే పొంగిపోతున్నారు!"

"ఇదొక పెద్ద ఫేషన్ అయిపోయింది ఈ మధ్య! ఆడవాళ్ళని ఉద్ధరిస్తున్నాం, వాళ్ళ ఉన్నతికోసం చెమటలు కక్కుతున్నాం అంటూ ఢంకా వాయించడం! ఏమిటో వీళ్ళు మనికిచ్చిన హక్కులు, సమానత్వమూ! పైకి అలా ఆశయాలు, ఆదర్శాలు వల్లించడం తప్ప ఎవరింట్లో వాళ్ళ దగ్గిరకి వచ్చేసరికి అవన్నీ ఇట్టే ఎగిరి చక్కాపోతాయి!" సుజాతా రవణమూర్తి మధ్యలో అంది.

"అక్కడికి పాపం వాళ్లు మన చేతికింద అణిగి మణిగి పడివున్నట్లు, మనం వాళ్ళమీద జులుం సాగిస్తున్నట్లు, క్లబ్బులో నలుగురూ చేరి ఒకర్నొకరు వోదార్చుకోడం కూడానూ! ఈ మొగాళ్ళందరికి యిదో వేషం అయిపోయింది ఈ మధ్య!" పద్మావతీ శర్మ కూడా కలిసింది.

"కథల్లో చూస్తే మనం తియ్యని మాటలు చెప్పి, వాలు చూపులతో లొంగదీసుకుంటామనీ, అంతగా ఇంకా లొంగక పోతే కన్నీళ్ళతో వశపరచుకుంటామనీ ఆ ఆయుధంతో మగాడి ఆట కట్టించి, మన ఇష్టం వచ్చినట్లు ఆడిస్తామనీ ఉత్తినే ఆడిపోసుకోవడం! మొన్నటికి మొన్న '...పత్రిక'లో

"......'కథ చదివారా ? ఎంత అన్యాయంగా వుందో"—
శ్యామలాసుబ్బారావు ఆవేశంగా అంది.

"అవును మేమూ చదివాం"

"వొళ్ళు మండుకొచ్చింది."

"మహా దారుణంగా వుంది."

"ఆడాళ్ళమీద గాబట్టి సరిపోయింది ! యిదే యే స్టూడెంట్సు మీదన్నా అయితే..."

"రైలుస్టేషన్లు తగలబడేవి ! టెలీఫోను వైర్లు తెగేవి! బస్సులు కాలేవి !"

"స్కూళ్ళు, కాలేజీలు నిరవధికంగా మూసేయబడేవి!"

"మనమూ ఓ కథ రాసేద్దాం."

"మగవాళ్ళ దురన్యాయాల గురించి ఏకిపారేద్దాం !"

"అసలు మనలో యింతమంది చేతులు తిరిగిన రచయిత్రులు వుండి, యింకా ఎందుకు రాయకుండా వూరుకున్నారా అని !..."

"ఈ పాటికి ఆరంభించే వుంటారు, ఎవరో ఒకరు !.."

అందరూ తలోమాట హడావిడిగా ఉత్సాహంగా అన్నారు.

"నిశ్శబ్దంగా వుండమని మనవి !" శారదాదేవి లేచి నిలబడి అంది. "ముందు నేను చెప్పేది విన్నాక మీ మీ అభిప్రాయాలు క్రమంగా వరసగా చెపుదురుగాని! నేనూ ఆ కథ చదివాను. నిజానికి యీ అత్యవసర సమావేశానికి కారణం ఆ కథే ! ఆ కథ చదివిన మగవాళ్ళు మనల్ని

ఎత్తి పొడవడం, అవసరమున్నా లేకపోయినా అందులో
సంగతులు కొన్ని కోట్ చేసి మనల్ని ఉడికించ ప్రయత్నిం
చడం చూశాక నా వళ్ళు మండింది. మొన్న మా యింట్లో
మా వారు ఇంకో నలుగురు పెద్దమనుష్యులని పోగేసుకుని
ఆ కథ చాలా సహజంగా వుందని, తమ పాట్లూ సరిగ్గా
అలాగే వున్నాయనీ, ఆడవాళ్ళ మహిళా మండళ్ళు, సమా
వేశాలు, తీర్మానాలమీద వ్యంగ్యాలు, నలుగురు ఆడవాళ్లు
కలిసినపుడు జరిగే సంభాషణలు అన్నీ చాలా సహజంగా
వున్నాయని పొగుడ్తూ, ఆడవాళ్ళు కలిసి చేసేదేం వుండదు.
అచ్చమ్మ పిచ్చమ్మ కబుర్లాడుకోడం తప్పించి అని వ్యాఖ్యా
నిస్తూంటే ఆవేశం ఆగిందికాదు.

కాని ఆవేశంవల్ల సాధించేదేం లేదు! ఈ మగవాళ్లకి
పాఠం చెప్పడానికన్నా, మనం ఇన్నాళ్ళు నిర్లక్ష్యం చేసిన
హక్కులకోసం పోరాడి, మాటల్లో కాక చేతల్లో మన
ప్రయోజకత్వం నిరూపించాలి. ఈ పోరాటం ఎక్కడో
బయట సంఘంలో, లోక్ సభలో జరగాల్సింది కాదు. కాగి
తాలమీద ఇచ్చే హక్కులు కాదు మనకి కావాల్సింది!
అక్కడ స్త్రీ ఎలాగో నెగ్గుకొస్తుంది. కాని మన యిళ్ళల్లో
యింకా వెనకబడే వున్న సంసారాల్లో మనం ఈ పోరాటం
సాగించి మగాడు అంటిపెట్టుకుని కూర్చున్న గద్దెనించి క్రిందికి
దింపి, అయ్యా, మీరూ నేనూ ఒకటే అన్నప్పుడు, ఇద్దరం
ఒకలాగ వుండడం చాలా అవసరం" అని చెప్దాం. యీ
మహిళా మండళ్లు ఉత్తినే చచ్చుకబుర్లు చెప్పుకునేందుకు.
సినిమాలు, సర్కస్‌లు వదిలినప్పుడులాగ గలాటా చేసేం

డుకు కావని నిరూపిద్దాం—కనీసం మనఇళ్ళలో మగవాళ్లకి! యింటగెలిచి రచ్చ గెలవమన్న సామెత చెప్పినట్టు మనం యింట్లో అడుగున పడుంటూ బయట ఏదో సాధించామని, ఆడవాళ్ళు ప్రధానమంత్రులు, రాయబారులు, గవర్నరులు అవుతున్నారని బుజాలు తట్టుకుంటే ఒరిగేదేం లేదు! ఎవ రింట్లో వాళ్లు ఈ పోరాటం సాగించి గెలిస్తే అదే మొత్తం 'స్త్రీ జనోద్ధరణ' అవుతుంది.

"అంచేత ఇక మాట్లాడేవారు తమ ప్రసంగాలని ఇంటి, యింటింటి సమస్యకే పరిమితం చెయ్యాలని కోరుతున్నాను. ఎవరి అనుభవాలు వారుచెప్పండి. ఎవరిపరిష్కార మార్గాలు వారు ప్రతిపాదించండి. అందరికి నచ్చిన పద్ధతి అవలం బిద్దాం. ముందు మన అధ్యక్షురాలు రాణి విమలాదేవిని మాట్లాడమని ఆహ్వానిస్తున్నాను." కార్యదర్శిని శారదాదేవి అసలు విషయం సభముందు వుంచింది.

రాణీ విమలాదేవి మాజీ రాచరికపు హుందాతో, యాభై ఏళ్ళ బరువుతో లేచి గంభీరంగా ఆరంభించింది.

"సోదరీమణులారా!

అనాదినించి, యుగయుగాలుగా, తరతరాలుగా స్త్రీ జాతి పురుషుడు అల్లిన సాలెగూడులో ఇరుక్కుని రకరకాల ఇక్కట్లు పడ్తూనేవుంది. అందుకు అనేక ఉదాహరణలు చెప్పకోవచ్చు. అలనాటి సీత, సావిత్రి, ద్రౌపది, దమయంతి మొదలు యీనాటి యిరవై శతాబ్దపు ఉత్తరార్థం వరకు! దీనికి కారణం ఏమిటి అని ఆలోచిస్తే ఏం కనపడుతూంది?

చాలా శోచనీయమైన హృదయ విదారకమయిన దుస్థితి. మనలో వ్యక్తిత్వాన్నే చంపి, మూఢనమ్మకాల బెదరింపుల్తో మనలో రకరకాల దిక్కుమాలిన అభిప్రాయాలు పాతుకుపోయేలాగ చేశారు! అందుకోసం ఎన్నిఉచ్చులు పన్నారు? ఇతిహాసాలు, పురాణాలు, ఉపనిషత్తులు ఏవేవో కల్పించి మనచుట్టూ మందంగా ఆకాశమెత్తు గోడలువేసి, మనలో మనకే నమ్మకం లేకుండాచేసి, మన ఆత్మవిశ్వాసం మంట గలిపి బానిసలుగా నీచంగా, హీనంగా ఉపయోగించుకున్నారు. శోచనీయమేమంటే, ఇంకా ఉపయోగించుకోవా అని చూస్తున్నారు. ఎంత చదువుకున్నా, ఉద్యోగాలు చేస్తున్నా, సంపాదిస్తున్నా, పార్లమెంటు సభ్యత్వంపొందినా, స్వంత ఇంట్లో స్త్రీ స్థానం మారలేదు. ఎక్కడవేసినగొంగళీ అక్కడే వున్నట్టుంది! ఆనాడు యీనాడు కూడా పురుషుని అధీనంలో, అతని అధికారానికి తలబగ్గి వుండవలసివస్తూంది? ఇలా ఎన్నాళ్ళు? యింకా ఎన్నోతరాలు యిలా వాళ్ళ జులుం సాగాల్సిందేనా? యివే మనల్ని ఎదుర్కొంటున్న ప్రశ్నలు? అయితే ఈ విషయాల గురించి మాట్లాడాల్సింది మీరు! యువతులు! నా తరం వెళ్ళిపోతూంది. వెళ్ళిపోతున్న మేం ఏం మాట్లాడినా సహజంగా వుండదు. కాబట్టి మీలో యువతులు ముందుకు వచ్చి మీకు తోచిన మాటలు చెప్పమని కోరుతూ యింతటితో విరమిస్తున్నాను."

సభలో కరతాళ ధ్వనులు. అందరూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

"మీరు మాట్లాడండి, సులోచన గారూ!" పద్మావతి అంది.

"నేనా? హఠాత్తుగా మాట్లాడమంటే ఏం మాట్లాడుతాను? ప్రిపేరు కాకుండా?"

"యిందులో ప్రిపేరు కావడానికి ఏముంది? ఇంట్లో అనుభవాలేగా చెప్పమంటున్నది! యిదేం డిబేటా, ఎన్నికల ప్రచారమా? పైగ్రిజులియ్యబోతున్నారా? ఏమన్నానా? ఏదో మనలో మనం కష్టం సుఖం చెప్పుకుంటున్నాంగాని!" మాలతీ వెంకట్రావు అంది.

"అవును, సులోచనగారు మాట్లాడాల్సిందే!" నాలుగైదు కంఠాలు ప్రోత్సహించాయి.

సులోచన తప్పదన్నట్టు లేచింది. ముప్పైఏళ్ళ మనిషి. గ్రాడ్యుయేటు. సాధారణంగా యెక్కడ ఏ విందులు, వినోదాలు, సభలు, సమావేశాలు జరిగినా ముందు వరసలో కనిపిస్తూంటుంది. అన్నింట్లో కుతూహలం కనబరుస్తూ చలాకీగా తిరుగుతూ చుట్టూ వున్న వాళ్ళని, చుట్టూ తిప్పుతూ వుంటుంది.

"మహిళలారా!

ఈనాడు సంఘంలో స్త్రీ వేషం మారిందిగాని స్థానం మారలేదని ఘంటాపథంగా చెప్పగలను. ఆ మధ్య ఓ రచయిత్రి అన్నట్టు "ఆడదాని అభ్యుదయం చేతికి వాచి కట్టుకుని, మొగుడితో సినిమాకి వెళ్ళేవరకు వచ్చింది! ఆ మాట అక్షరాల నిజం! అంతే! ఆమీదట శతాబ్దాల క్రిందటి స్త్రీకి, మనకి పెద్ద తేడా ఏం కనపడ్డం లేదు నాకు! ఆ రోజుల్లోనే

ఇంకా కాస్త గౌరవం వుండేదేమో ఇప్పటికన్నా! ఎంత పెద్ద ఉద్యోగాలు చేసినా ఇంటిలో మగాడి చెప్పుచేతల్లో ఉండక తప్పదు! పెళ్ళికాక ముందు తండ్రి, పెళ్ళయ్యాక భర్త, ముసలితనంలో కొడుకు... ఈ విధంగా ఆడదాని బ్రతుకంతా పురుషుడి అధికారంలో వుండక తప్పడంలేదు. ఇంటిలో మగాడి ఇష్టంలేకుండా బయటికి రాకూడదు! బయటికి వచ్చినా వాళ్ళలా మన ఇష్టం వచ్చినట్లు తిరిగిరావడానికి వీలా? ఇది సూక్ష్మంగా పరిశీలిస్తే చాలు అర్థమవుతుంది. మనకి దొరికిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు యేమాత్రమో!..."

"నిజమేనమ్మా. మావారు రాత్రి పదకొండు గంటలకి క్లబ్బునించి వచ్చినా చచ్చినట్టు నోర్మూసుకుని పడుంటున్నాను. అదే నేనూ అలా అర్థరాత్రి దాకా తిరిగి వస్తే ఊరుకుంటారా?" సుందరమ్మ అంది.

"మీవారు పదకొండుకేనా వస్తారు. నయమే! మావారు రెండుగంటలలోపు యింటికి చేరితే ఒట్టే ..ఏంచేస్తాను. చచ్చినట్టు ఊరుకోవడంలేదూ! అప్పుడు లేచి అర్థరాత్రి అన్నం పెట్టడంలేదూ!" మీనాక్షమ్మ వంతపాట.

"ఉష్! నిశ్శబ్దంగా వుండండమ్మా! ఇలా మధ్య మధ్య మాట్లాడతామనే కథలో చెప్పింది!"

"ఎటొచ్చీ అప్పటికీ ఇప్పటికీ వేషభాషలు మారాయి. కాస్త నాజూకు, చదువు సంస్కారంతో బాటు వచ్చింది. అంత మాత్రానికే మగవాళ్ళు మనకేదో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు యిచ్చేసినట్టు, మనం వాటిని దుర్వినియోగ

వచ్చి, వాళ్ళపైన సవారి చేస్తున్నట్టు అపోహపడి బెంగలు పెట్టుకుంటున్నారు. ఆడవాళ్ళకి సీట్లిచ్చాం, గేట్లిచ్చాం, రైలు పెట్టెలు ఇచ్చాం, స్కూళ్ళు ఇచ్చాం, కాలేజీలు యిచ్చాం, ఉద్యోగాలు యిచ్చాం, యిదంతా చేసి అనవసరంగా వాళ్ళని నెత్తికెక్కించుకున్నాం, అనుభవిస్తున్నాం అని వాపోతున్నారు పురుష పుంగవులు !

"మాతో సమానంగా చదవనిస్తున్నాం, వుద్యోగాలు చేయనిస్తున్నాం, మాతో వెంటబెట్టుకొని సినిమాలకి తీసుకెడుతున్నాం, పార్టీలకి ఆహ్వానిస్తున్నాం, డ్రైవింగ్ నేర్పాం, నైలాన్లు కట్టనిచ్చాం, స్లీవ్ లెస్‌లు తొడుక్కోనిచ్చాం, రోజుకో హెయిర్ స్టయిల్ మార్చినా సహించాం, చెప్పులు తొడుక్కోనిచ్చాం! ... ఇంకేం కావాలి ! మాతో సమానంగా సర్వ హక్కులు మీకూ వున్నాయి ! మీకేం లోటు చేశాం ?" అని వాళ్ళ విశాలహృదయం చాటుకుంటున్నారు మగవాళ్ళు. ఇంకా నయం. మాలాగ ఊపిరి తీయనిస్తున్నాం, మిమ్మల్ని భోజనం చేయనిస్తున్నాం అని అననందుకు సంతోషించాలి! ఇంతేకాదు... మన సుఖంకోసమే స్టవ్‌లు, ప్రెషర్ కుక్కర్లు, ఫ్రిజిడేర్లు, గ్రైండర్లు, టోస్టర్లు, ఇస్త్రీపెట్టెలు ఇవన్నీ తెచ్చి పెట్టుతున్నామంటే మనం ఆశ్చర్యపడనక్కరలేదు. ఇవన్నీ ఆడదాని పురోగతికోసం వాళ్ళుపడే పాట్ల క్రింద జమ(ట) ! ఇంతకన్నా ఐరనీ ఇంకేం వుంటుందో నాకు తెలియదు !..."

"హియర్ ! ...హియర్ !" నాలుగైదు కంఠాలు ఉత్సాహంగా అరిచాయి. దాంతో సులోచన మరింత ఉత్సాహం పుంజుకుంది.

"మనం చదువుకున్నందువల్ల వీళ్ళకి చాకలిపద్దులు, బజారుబిల్లులు, యిన్సూరెన్స్ ప్రీమియంలు చూసే మంచి రకం గుమస్తాయే కాకుండా, జీతంబత్తెంలేని పంతులమ్మ కూడా దొరికింది పిల్లలకి! మనం ఉద్యోగం చేసినందువల్ల వీళ్ళ సిగరెట్, టీలు, సినిమాలఖర్చులు దర్జాగా వెళ్ళిపోవడమేకాక, మన చీరల ఖర్చుకూడ కలిసివస్తూంది! పిల్లల ఉచ్చలు, దొడ్లు, వేరుశనగచెత్త, బత్తాయితొక్కలు, పిల్లల యేడుపులు, అరుపులనించి తప్పించుకొని, హాయిగా పేకాటో, పడకో చిత్తగించడానికి మనల్ని వేరే రైలు పెట్టెలో కూర్చొపెట్టి అదీ మనకోసమే అంటున్నారు!..."

"నిజమే బాగా చెప్పారు! అందుకే మావారు యెక్కడికి వెళ్ళినా నన్ను ముందు ఆడాళ్ళపెట్టెలో ఎక్కించేసి, ఇంక గిజామన్నా కనపడకుండా మాయమయిపోతారు, దిగే స్టేషన్ వచ్చేవరకు!" బుగ్గలు నొక్కుకుంది పార్వతమ్మ.

"దయచేసి ప్రసంగం మధ్యలో మాట్లాడవద్దని ఇంకోసారి మనవిచేస్తున్నాను. మాట్లాడాలని వున్నవారంతా ఆమె దిగినాక మాట్లాడవచ్చు" సెక్రటరీ శారదాదేవి ఇంకోసారి హెచ్చరించింది.

"అయ్యో! రాత! మాకేంవచ్చు. ప్రసంగాలు, వుపన్యాసాలు, దిబ్బ! ఏదో మాటవచ్చిందిగాబట్టి అన్నా!" మూతి త్రిప్పుకుంది పార్వతమ్మ.

"కానీండి, సులోచనగారూ!"

"రైలుపెట్టెలలాగే సినిమాలూ ! ఏడుపులకీ, గోలకి దూరంగా వుందామన్న స్వార్థంతప్ప, మనమీద ఆపేక్ష యెంతమాత్రంగాదు ! అలాగే స్కూళ్ళు, కాలేజీలూనూ ! చదివే మన సంఖ్యకూడా ఎక్కువయింది. కాబట్టి విడిగావుంటే కాస్త మగవాళ్ళు బుద్ధిగా చదువుతారని మనల్ని వేరుగా పడేశారు ! అందర్లోనూ సంస్కారులమని, ఆధునికులమనీ బురఖా కప్పుకోడానికి పెళ్ళాన్ని పార్టీలకి సినిమాలకి తీసుకెడుతున్నారు. పత్రికలలో పేజీలు కేటాయించామన్నదొక క్రొత్త ఘనకార్యం ! అరవై డెభ్భై పేజీల పుస్తకంలో ఓ రెండు పేజీలు ఆడవాళ్ళ పేరుతో ప్రచురించి, అందులో సగం మగవాళ్ళ ప్రశ్నోత్తరాలతో సరిపెట్టి, ఎంత విశాల హృదయం చాటుకుంటున్నారు మగవాళ్ళు ! పత్రికలు చదివేవారిలో అధికసంఖ్యాకులు స్త్రీలు కాబట్టి, వాళ్ళని ఆకర్షించి, సంతృప్తిపరచి సేల్సు ఎక్కువ చేసుకోవాలన్న వ్యాపారదృష్టి తప్ప ఇంకేం లేదని ఎవరికి తెలియదనో ! ఆడది కలం పడితేనే చాలని మన కథలలో ఏ పసా లేకుండానే ప్రైజులు ఇచ్చేస్తున్నారట ! ఆడవాళ్ళ పురోభివృద్ధికి పాటుపడడంలో యిదో మార్గమట! ఆడదీ అవకాశం యిస్తే తమని అన్ని విషయాలలోనూ మించగలదన్న నిజం ఒప్పుకోలేక, యీ రాస్తున్న ఆడవాళ్ళందరికి మగవాళ్లే రాసిపెడుతున్నారని చాటుకుని సంతృప్తిపడుతున్నారు మగవాళ్ళు !

"డ్రైవర్ని పెట్టుకుంటే డబ్బు ఖర్చని, డ్రైవింగ్ నేర్పి పిల్లల్ని స్కూళ్ళకి దింపమని, వాళ్ళు చేసే పనులుకూడా

మన నెత్తిన రుద్ది బజారు పనులు చేయించడం, అదీ స్త్రీ జాతి అభ్యుదయానికే అంటే ఏడవాలా నవ్వాలా ? ఈ కరువు కాలంలో ఓ పావుగజం గుడ్డ తగ్గినా తగ్గడమేనని వాళ్ళకి తెలియకనా, స్లీవ్ లెస్ లు తొడుక్కోనిచ్చేది ! అలాగే నైలాన్లు, డ్రలాన్లు, టెర్లిన్లు చాకలిఖర్చు తగ్గుతుందనే కట్టనిస్తున్నారు. ఇంక మన జుట్టుని మనం రకరకాల సింగారించుకోడానికికూడా వాళ్ళే జాలిపడి పర్మిషన్ యిస్తున్నట్టు మాట్లాడుతూంటే ... ఇంక దానికి జవాబు ఏముంటుంది ?! ... నిజానికి మన శరీరాలమీదనే మనకి హక్కులేదన్న సంగతి నేను చెప్పనక్కరలేకుండానే మీకందరికీ తెలుసు ! ...”

అందరూ ఒకరి మొగాలు ఒకరు చూసుకుని ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారు.

“మన క్కావల్సింది యేదన్నా సాధించాలంటే ముందు కావల్సింది మన మంతా ఐకమత్యంతో ఒక త్రాటి మీద నడవడం ! అది లేనినాడు యెన్ని సభలు, చర్చలు, ఉపన్యాసాలు జరిగినా శుష్క దండుగ ! మరింతగా నలుగురిలోనూ ఎగతాళి చేయబడ్డంతప్ప జరిగేదేం వుండదు !” సులోచన తన మాటల ప్రభావం అందరిమీద ఎలా పని చేస్తోందోనని పరికించి చూసి కూర్చుంది. సభ్యులు యథావిధి చప్పట్లు చరిచారు.

“ఈసారి మీరు మాట్లాడండీ, లలితగారూ ! మీరు ఉద్యోగినులుకదా ! ఉద్యోగాలు చెయ్యనిచ్చాం అని ప్రగ

ల్భాలు పలికే మగవారికి సమాధానంగా అందులో జరిగే అన్యాయా లేమిటో వివరించండి!" శారదాదేవి కోరింది.

లలిత ఎమ్. ఏ ప్యాసయి కాలేజీలో ఉద్యోగం చేస్తూంది. భర్త కూడా ఎమ్. ఏ. అదే కాలేజీలో ఉద్యోగం. లలిత సందేహిస్తూ వచ్చి, విషయం సూటిగానే ఎత్తుకుంది.

"నేను ఉద్యోగినన్న మాట నిజం! వారూ నేనూ ఒకలాగే చదువుకున్నాం ఒకే ఉద్యోగం చేస్తున్నాం. ఒక లాగే సంపాదిస్తున్నాం. అయితే ఆ సమానత్వం అంతా వీధిలో ఉన్నంతవరకే! ఇంటిలో కడుగు పెట్టగానే, మళ్ళీ మేం యిద్దరం మామూలు అందరి స్త్రీ పురుషుల్లాగే భార్యాభర్తలమన్న సంగతి వారెన్నడూ మరిచిపోలేదు. నన్ను మరచిపోనీయలేదు! ఉద్యోగాలు సమానంగా చేస్తున్నాం కాబట్టి, రోజూ ఓ పూట మీరు, ఒకపూట నేను వండుదాం.. ఇంట్లో పని ఇద్దరం సమానంగా చేసు కుందాం అంటే ఊరుకుంటారా? ఇక్కడే తేలిపోతుంది ఆడ మగా సమానత్వం యెంతవరకు నిజమో! పోనీ, అదలావుంచి మనం సంపాదించినది వాళ్ళకి చెప్పని, తెలి యని ఖర్చులు పెట్టడానికైనా లేదే? వాళ్ళు మనకి అన్నీ చెప్పే చేస్తున్నారా? ఇవన్నీ మామూలుగా అందరికి జరి గేవి. ఇంకా కొన్ని కొన్ని చిత్రాలు జరుగుతూంటాయి ఒకోచోట! ఆఫీసులో కనపడ్డ ప్రతీ ఆడదానితో నవ్వుతూ మాట్లాడడం, సరసాలాడ్డం, సంస్కారమనీ, నాగరికమనీ

భావించే మగవాడు, భార్య ఆఫీసులో తోటి ఉద్యోగులతో నవ్వుతూ మాట్లాడినా, కలసి యెక్కడకన్నా వెళ్ళినా రకరకాల అపోహలు పడిపోతాడు! కాబట్టి అతడికి జడిసి యీమె మాటలురాని మూగదానిలా, నవ్వడం తెలియని దానిలా, బుద్ధిగా తలవంచుకు పని చేసుకుని, టైముకి తల వంచుకుని యింటికి చేరాలి! ఇంటికి ఓ అరగంట ఆలస్యంగా వస్తే అదీ గొడవే!" ...

"మొన్న ఏమయిందో తెలుసా! ఆఫీసులో పనెక్కువ వుండి రోజుకన్నా ఓ గంట ఆలస్యంగా యింటికి వెళ్లాను. దొరగారికి ఆఫీసునించి రాగానే వేళకి కాఫీ అందలేదని చిందులు! ఎక్కడ కెళ్లావు? ఇంతసేపు ఏంచేస్తున్నావు? వేళకి రావాలని తెలీదూ అంటూ ప్రశ్నలు, ఏం, కాఫీ కలుపుకుని తను తాగి, నాకోసం ఫ్లాస్కులో ఒకపూట అయినా వుంచితే మగతనానికి ముప్పు గాబోలు! ఆఫీసులో టైపిస్టు ఉద్యోగం చేస్తున్న సత్యవతి ప్రక్కనున్న సహోద్యోగిని మేరీతో అంటూంది.

"మనం వూరుకుంటే సరి! గట్టిగా జవాబీయలేక పోయావా?" మేరీ ప్రశ్న.

"నోరున్నవాళ్ళదే రాజ్యం! మనం ఏం అంటే చెల్లుతుంది! ఏమన్నా అంటే నిన్ను పెళ్ళాడ్డం ఒక తప్పు. ఉద్యోగం చేయించడం ఒక తప్పు అని నేను కాస్త చికాకులో జవాబిచ్చానని, యింకో నాలుగని అలిగి యింట్లోంచి లేచి వెళ్ళిపోయారు? ఏమిటో మన జన్మ యింతే!" నిస్పృహగా అంది సత్యవతి.

"అంతలా మనం నిరాశపడి నీరసంగా వుండిపోవటం చేతే అబలలని ముద్దు పేరు పెట్టి అధికారం చెలాయిస్తు న్నారు మగవాళ్ళు! అందుకే మనం ఐకమత్యంగా కూడ బలుక్కుని, యీ నిరంకుశత్వం యింక సాగదని యింటింటా విప్లవం లేవదీసి, సమానహక్కులు పొందాలి!" లలిత ముగిం చింది.

"ఇంకెవరన్నా మాట్లాడుతారా ?" శారదాదేవి అందర్నీ అడిగింది.

"ఇంకేముంది మాట్లాడడానికి! ఎవరు మాట్లాడినా ఇదేగా !"

"వాళ్ళు మనల్ని ఉద్ధరించనూవద్దూ, పాడూవద్దూ. వేళకివచ్చి తిని పడుకుని సాధింపులు, తిట్లు లేకుండా సక్ర మంగా వ్యవహరిస్తే అంతేచాలు ! ఆడదాని కష్టం సుఖం, మంచి చెడ్డా ఆలోచిస్తే అదే చాలు." సుందరమ్మ అంది.

"వాళ్ళలాగే మనమూ పిల్లల్ని వాళ్ళ మొహాన పడేసి అర్ధరాత్రిదాకా తిరిగివస్తే వూరుకుంటారా ?"

"ఈ అత్యాచారాన్ని అరికట్టాలి !"

సభలో కలకలం మొదలైంది.

"ఇంకెవరన్నా మాట్లాడుతారా అంటే అందరూ మాట్లాడాలని నా ఉద్దేశంగాదు. ఆగండి...ఆగండి ! ఒకరి తరువాత ఒకరు."

ఈ లోపల మితభాషిణి ముందుకువచ్చింది. మిత భాషిణి అన్న పేరు ఆమె స్వభావాన్నిబట్టి నలుగురూ ఆమెకి ఇచ్చిన ముద్దుపేరు.

"సోదరీమణులారా !

మన స్త్రీలకి పురుషులు ఏమాత్రం సమానత్వం యిస్తున్నారో, ఏమాత్రం గౌరవం ఇస్తున్నారో చెప్పడానికి ఇన్నిమాటలు అక్కరలేదు. ఒక్క ఉదాహరణ చాలు ! ఒక వంటవాడు వున్నాడంటే ఊరందరికి వండుతాడుగాని, చస్తే ఒకపూటన్నా పెళ్ళానికి వండిపెట్టడు ! దీన్నిబట్టే ఊహించవచ్చు. భారతదేశంలో స్త్రీ స్థానం యెక్కడో !"

చాలా మితంగా మాట్లాడి పేరు నిలబెట్టుకున్నందుకు నలుగురూ నవ్వారు. తరువాత 'లాజికేశ్వరి' లేచి, తను యూనివర్సిటీలో పఠించిన లాజిక్ పరిజ్ఞానంతో సభికురాండ్రను తబ్బిబ్బు చేసింది.

"అక్కయ్యలూ, చెల్లాయిలూ,

అసలు నన్నడిగితే, భగవంతుడూ మొగాడేకాబట్టి సృష్టిలోనే మనకి అన్యాయం చేశాడంటాను...సరే పిల్లల్ని కనడం మనకెలాగూ తప్పదు. ఆ పిల్లల్ని పెంచడం ఆ బాధలు, ఆ కష్టాలు అన్నీ మనం ఒక్కరమే ఎందుకుపడాలి? అర్ధరాత్రి నిద్రలేచి ఏడ్చేపిల్లను ఆడదే యెందుకు సముదాయించాలి ! మగాడు ఏం పట్టనట్లు పడుకోడం, లేచినా విసుక్కోవడం తప్ప యింకేం చెయ్యకుండా ఎందుకుండాలి! మనమే ఉద్యోగంచేసి వాళ్ళే ఇంట్లో ఎందుకు పడుండకూడదు ? వాళ్ళ షేవింగ్ సెట్లు కడగాలి ! నీళ్ళు, కాఫీలు అందించాలి, బట్టలుతకాలి, బొత్తాలుకుట్టాలి, యిస్త్రీ చెయ్యాలి మనం. అలాగ వాళ్ళు మన జాకెట్లు యిస్త్రీ యెందుకు చెయ్యరు ? మన చీరలు యెందుకు వుతకరు ?

కాఫీలు, నీళ్ళు ఎందుకు అందీయకూడదు ? అసలు భర్తని భార్య మీరు అని మన్నించి సంబోధిస్తుంది. గాని, భార్యని ఏకవచనంతో పిలుస్తాడేం మగవాడు ? వీటన్నింటికి జవాబేమిటి ? జవాబు తెలియని మనం దద్దమ్మల్లా సరిపెట్టుకుని ఊరుకోబట్టే యింతదాకా వచ్చింది. ఇహముందేనా మనం కళ్ళు తెరవడం చాల అవసరం. కళ్ళు తెరచి, ఎంతటి హీన స్థితిలో వున్నామో తెలుసుకుని, తను నిజంగా ఆటబొమ్మ కాదని, తనకీ మగాడితో సమానంగా గౌరవాధికారాలు ముట్టాలని పోరాడాల్సిన అవసరం ఎంతయినావుంది." సభలో కరతాళ ధ్వనులు ముగిశాక నలుగురివంక చూసి, ఇంకెవరూ మాట్లాడేవారు లేరని గ్రహించి శారదాదేవి లేచినిలబడి—

"మన సోదరీమణులు చెప్పినదంతా విన్నాక గృహంలో స్త్రీ స్థానం యెంతమాత్రం మారలేదని, మగాళ్ళు గొప్పగా చెప్పుకునేవన్నీ పట్టి ప్రగల్భాలేనని రుజువవుతూంది. అయితే వాళ్ళు చెప్పిన వాటిలో కొన్నైనా మనం నిజంగా సాధించాలన్న విషయం మీద మనలో ఏకాభిప్రాయం కుదిరిందనుకుంటాను. ఇహ వాటిని సాధించడం యెలాగ అన్న సంగతి ఇప్పుడు పరిశీలిద్దాం!..."

"మనమూ 'ఘోరావ్' 'నిరాహారదీక్ష' 'సహాయ నిరాకరణోద్యమం' లాంటివి లేవదీద్దాం!" ప్రియంవద నవ్వుతూ అంది.

"గుడ్ ఐడియా !... బాగుంది ఆలోచన. ఘోరావ్ అన్నది మన విషయంలో కుదరదు. ఉద్యోగరీత్యా బయటికి వెళ్ళాల్సిన మగాడిని ఇంట్లో కట్టెయ్యలేం. తిండి మానేసి

నిరాహారదీక్ష వున్నా నష్టపోయేది మనమేగాని వాళ్లు దానికి అంత త్వరలో కరుగుతారనుకోను. కాబట్టి మనం 'సహాయ నిరాకరణోద్యమం' సాగిద్దాం."

"అంటే !"

"అంటే మగవాళ్ళు మనమీద రోజూ చలాయించే జుల్మ్‌కి స్వస్తి చెప్పిస్తామన్నమాట. తెల్లారి లేచింది మొదలు నీళ్ళు అందించడం, షేవింగ్ సెట్లు కడగడం, బనీన్లు, సాక్సు షర్టులు వగైరా ఉతకడం ఈ చాకిరీ అంతా మానాలి. పురుషుడు వుద్యోగంచేసి డబ్బు సంపాదిస్తే మనం ఇంట్లో వంటవండి, పిల్లల్ని చూసుకుని ఇల్లు చక్కదిద్దుతాం. అంతే. అంతకు మించి ఒక్కడుగు ముందుకు వెయ్యకూడదు. వాళ్ళ ఉద్యోగాలకి టైములున్నట్టే ఇంట్లో మన కార్యక్రమాలకి కాలపరిమితులుండాలి.

"ప్రొద్దున్న యెనిమిది గంటలకి లేచిన శ్రీవారికోసం మళ్ళీ ప్రత్యేకంగా కాఫీ కలిపి ఈయడం జరగదు. వాళ్ళ పనులు మనం చెయ్యం, వాళ్ళ బట్టలుతకం, తువ్వాళ్ళు అందించం, బొత్తాలు కుట్టం, భోజనాలకీ ఓ టైముండాలి. రాత్రి ఎనిమిది తర్వాత భోజనం బంద్. రాత్రి పదిగంటలు దాటాక వచ్చి తలుపులు బాదితే తెరిచేదిలేదు. మనం ఇవన్నీ అమలుపరచిననాడుగాని స్త్రీ సహాయసహకారాలు వాళ్ళకెంత అవసరమో, స్త్రీ విలువ యెంతో వాళ్ళకి తెలిసిరాదు. మనం వాళ్ళకి చాకిరి చెయ్యనినాడు వాళ్ళకి కలిగే లోటుపాట్లు, మన సహకారం లేనిదే వాళ్ళేం చెయ్యలేరన్న సంగతి వాళ్ళకి తెలియ చెప్పాలి. పాఠం నేర్పాలి.

మన విలువ వారికి తెలిసిననాడు, స్త్రీని గౌరవించడం వారే నేర్చుకుంటారని ఆశిద్దాం.

"తర్వాత సమానంగా చూస్తున్నామన్న యీ మగ వాళ్ళకిమల్లే మనమూ ప్రవర్తిస్తే, మనలో సహస్రాంశమైనా సహనం ఓర్పు చూపెట్టి వూరుకోగలరేమో పరీక్షించాలి. అందుకని మనం మన యిష్టం వచ్చినట్లు, మనమూ చెప్పా చెయ్యకుండా తిరిగి తిరిగి ఏ రాత్రికో యింటికి చేరాలి. మన ఇష్టం వచ్చినట్లు మనకి నచ్చిన రీతుల్లో ముస్తాబయి, వీలయి నంత ఎక్కువ ఖర్చుపెడ్తూ నలుగురిని పోగేసుకుని సినిమా లకి, షికార్లకీ తిరుగుతూ రాత్రి పదకొండుగంటలకి ఇంటి కొచ్చి, నిద్రపోతున్న వాళ్ళని లేపి తలుపులు తీయించాలి. ఇన్నాళ్ళు మనం చూపినసహనం, ఓర్పు ఎంతటిదో వాళ్ళకి తెలిసిరావాలి ! ఏమంటారు ? మీ ఉద్దేశం ఏమిటి ?"

"చాలా బాగుంది ఇలాచేస్తే ఒక్క వారంరోజుల్లో దారికి వస్తారు. మనం పడ్తున్న కష్టాలు, బాధలు అప్పటికి గాని అర్థంగావు వాళ్ళకి !" అందరి మొహాలు ఉత్సాహంగా వికసించాయి. ఘన విజయం సాధించబోతున్నామన్న గర్వం వాళ్ళ కళ్ళలో అప్పుడే తొంగిచూడసాగింది.

"మనం అంతా ఇలా ఏకాభిప్రాయానికి రావడమే ఈ ఉద్యమం విజయవంతం కాగలదని సూచిస్తూంది ! ఇంక కార్యాచరణలో పెట్టడమే తరువాయి. ఎల్లుండి 1 వ తారీకు శుభముహూర్తంగా నిశ్చయించుకుని ఆ రోజు మొదలు మన కార్యక్రమం కొనసాగిద్దాం"

"ఓ కె !... అలాగే !..." ముక్తకంఠంతో జవా బొచ్చింది.

"ఈ ఉద్యమం ఎంతవరకు ఆశయాలు సాధించిందీ పర్యవలోకించేందుకు వారానికోసారి సమావేశం అయి చర్చిద్దాం. కనీసం ఒక నెల అయినా యిది కొనసాగించాలి. తర్వాత ఇంకోసంగతి. పురుషుల తీపిమాటలకి, ప్రేమ కబుర్లకి లొంగి మన నియమాలు మరచిపోకూడదు ? జాలి పడి, మన కఠిన నిబంధనలని ఎంత మాత్రం సడలించ కూడదు ! ఈ సంగతి మీరు మరువకండి !"

"సరే ఇంతటితో ఈ సమావేశం ముగిద్దాం, మళ్ళీ వారం సరిగా ఇలాగే సమావేశం అవుదాం !" మూడు గంటల సుదీర్ఘ సమావేశాన్ని ముగించి లేచింది శారదా దేవి.

*　*　*

"శుభోదయం ! ఏమిటీ వింత ! దొరవారు ఇవాళ ఆరు గంటలకే లేచారు !" ఎనిమిది గంటలకి ఎనిమిది సార్లు లేపితేనే కాని లేవని కృష్ణమూర్తి లేపకుండానే ఆరు గంట లకి లేచిపోవడం కాస్త వింతేననిపించింది ప్రియంవదకి.

"అవును ప్రియా ! పాపం నా నుంచి నీవు మళ్ళీ మళ్ళీ కాఫీకలపడం, అదీ శ్రమ అని నీతోపాటే ఇహామీాదట ఆరు గంటలకే లేచిపోవాలని నిర్ణయించుకున్నాను. టిఫిన్ చల్లారి పోతుందని అలా నాకోసం కాచుకు కూర్చోవడం, పనులన్నీ అలా వుండిపోవడం, ఎందుకొచ్చిన అవస్థ నానుంచి నీకు !"

“ఆహా! క్రొత్తగా నా మీద ఎంత జాలి పుట్టుకొచ్చింది ఇవాళ!”

“నువ్వాశ్చర్య పోతావు! నిజమే. నేనిన్నాళ్ళూ నీ కష్టం సుఖం ఆలోచించకుండా ఉత్తి స్వార్థపరుడిలా ప్రవర్తించి నిన్ను నానా ఇబ్బందీ పెట్టాను. ఇలా కట్టుకున్న పెళ్ళాం సుఖం ఆలోచించకుండా ఇన్నాళ్ళూ ఇంత ఇదిగా ఎలా వున్నానో తల్చుకుంటే నాకే బాధనిపిస్తూంది!”

“ఒక్కసారిగా ఇంత జ్ఞానోదయం ఎలాగైందో?”

“జ్ఞానోదయం అన్నది సరైన మాటే! ఈ జ్ఞానం లేకనే ఇన్నాళ్లూ ఇలా ప్రవర్తించాను. భార్యని మనవాళ్లు ఏమన్నారు? అర్ధాంగి అన్నారు. అంటే ఉత్త శరీరంలోనే కాదు, అన్నింటిలోనూ సగభాగం అన్నారు. దాంట్లో ఆలోచిస్తే ఎంత అర్థంవుంది. ఆ ఆలోచన లేక ఇన్నాళ్లూ... ఛా ఆ సంగతి తల్చుకుంటే సిగ్గేస్తూంది! నీ కీయ వలసిన హక్కులు నీ కీయకుండా ఇన్నాళ్ళూ ఉత్త మూర్ఖుడిలా.... స్వార్థపరుడిలా ప్రవర్తించాను...”

“ఏమిటయింది, మీకు ఇవాళ ప్రొద్దున్నే? ఇంకా నిద్రమత్తు వదల లేనట్లుంది! వెళ్ళి పడుకోండి, ఆ పీడకల ఏదో వదిలేదాకా! నేను వచ్చి మామూలుగా ఎనిమిది గంటలకి లేపుతాను!” హాస్యంగాఅని వెళ్ళిపోయింది ప్రియంవద, అదంతా తమాషాక్రింద జమకట్టి.

కాని అది ఉత్తి నటన, తమాషా కాదన్న సంగతి ఆ సాయంత్రం లోపల అనేక సందర్భాలలో రుజువయింది.

కృష్ణమూర్తి స్వయంగా టూత్ పేస్టు అంటించుకుని పళ్ళు తోముకున్నాడు. స్వయంగా బాయిలర్ లో నీళ్ళు తెచ్చుకుని గడ్డం గీసుకొని షేవింగ్ సెట్ బుద్ధిగా కడిగేసుకున్నాడు. వేడినీళ్ళు తోడుకుని స్నానం చేశాడు. స్వయంగా తువ్వాలు ఆరేసుకున్నాడు. కట్టుకోవలసిన బట్టలు తనే స్వయంగా ఎంచుకుని బయట పెట్టుకున్నాడు. జోళ్ళు పాలిష్ చేసుకున్నాడు. టిఫిన్, కాఫీలకి వేళకి పిలిపించుకోకుండా తనే బుద్ధిగా వచ్చి కూర్చుని తిన్నాడు.

ఆ పనులన్నీ తనతో చెప్పకుండా స్వయంగా చేసుకుంటూంటే... అంతకు ముందు తాము చేసుకున్న నిర్ణయాల మాట మరచిన ప్రియంవద మనసు చివుక్కుమంది. పెళ్ళయిన క్షణంనించి అన్నింటికి తనమీద ఆధారపడి చేయించుకునే భర్త, తన ఉనికే మరచినట్లు తనుచేసే పనులన్నీ స్వయంగా చేసుకోవడం చూస్తే కాస్త ఎందుకోబాధ అనిపించింది. తను చేయకూడదని నిశ్చయించుకున్న పనులని కృష్ణమూర్తి చెయ్యమని అడిగితే. చెయ్యకుండా, తన విలువ గుర్తించేట్టు చేయాలనుకున్న ప్రియంవదకి ఆశాభంగంతోపాటు, భర్త తనని నిర్లక్ష్యం చేస్తున్నాడన్న ఊహతో అహం దెబ్బతింది.

అలా అని కృష్ణమూర్తికి కోపం వచ్చిందేమో అనుకోడానికి ఆధారం కనపడలేదు. మామూలుగా నవ్వుతూ విట్లు వేస్తూ, ప్రియంవద వెంట వెంట తిరుగుతూనే వున్నాడు.

ఆ సాయంత్రం క్లబ్బుకూడా మానేసి ఇంటిపట్టున కూర్చున్న కృష్ణమూర్తిని చూసి నిజంగా ఆశ్చర్యపోయి అనుమానంగా చూసి, అడిగింది ప్రియంవద.

"పోనిద్దూ !... వెధవక్లబ్బు ! నీకంటె ఎక్కువా నాకు. నా కోసం ఒక్కదానివి ఇంట్లో కూర్చుని, ఎదురు చూస్తూంటావన్న జ్ఞానంలేక ..ఇన్నాళ్లూ మూర్ఖుడిలా ప్రవర్తించాను గదూ !"

"ఏమిటి వేషం ! దీనిభావం ఏమి తిరుమలేశా ! నా మనసు పరిభ్రమిస్తుందా ? నాకళ్ళు మాయ చేస్తున్నాయా ? కలా, నిజమా ?— హఠాత్తుగా ఇంత బుద్ధిమంతులు ఎలా అయిపోయారు చెప్మా !"

"లేదు ప్రియా !—నిజంగానే ఇన్నాళ్ళూ నీ విలువ గుర్తించలేకపోయాను. హాయిగా నీతో కబుర్లాడుకుంటూ కూర్చోకుండా ఆ వెధవ క్లబ్బుకి ఎందుకు? డబ్బుదండగ, నిద్ర దండగ! ఏమంటావు ? అలా చూస్తావేమిటి ? అలా షైరెళ్ళి వద్దామా పోనీ సినిమాకి వెడదామా ? ఏదీ లేకపోతే ఇద్దరం చక్కగా ఇలా ఎదురెదురుగా కూర్చుందాం ! ఏం ?"

తెల్లబోయి చూస్తూ వూరుకుండి పోయింది ప్రియంవద. ఇదేమిటి ప్లేటు ఇలా ఫిరాయించాడు ? ఆదిలోనే తన నిర్ణయాలకి హంసపాదు పడిందేమిటి ? ఏ పని చెప్పని మనిషికి చెయ్యొనని ఎలా చెప్పడం ? క్లబ్బుకే వెళ్ళని మనిషికి భోజనం ఎలా పెట్టక పోవడం ? తలుపులు ఎలా తీయక పోవడం... ప్రియంవదకి ఏం చెయ్యాలో అంతుబట్టలేదు.

"ప్రియా, అలా చక్కగా ఎక్కడైనా మీ ఫ్రెండ్స్ ఇంటికి తిరిగిరాకూడదూ! పాపం యింట్లో అస్తమానూ కూర్చుంటే ఏం ఊసుపోతుంది... వెళ్ళు. అలా తిరిగిరా, ఆలస్యం అయినా ఫరవాలేదు...నే వున్నానుగా ఇంట్లో... కావలిస్తే అన్నం నేను దింపేస్తాలే ఉడికాక..."

ప్రియంవదకి మతిపోయినట్లయింది. వెళ్ళమని, ఆలస్యం అయినా పరవాలేదన్న మనిషికి తను ఇష్టంవచ్చినట్లు తిరిగి వచ్చి బుద్ధిచెప్పడం ఎలాగ ?...

ఆ... ఏదో గాలికి తిరిగి ఓరోజు ఇలా పెద్దకబుర్లు చెపుతున్నారుగాని... రేపటికి మళ్ళీ మామూలు అయిపోరూ... అప్పుడే అమలులో పెట్టచ్చు తన నిర్ణయాలని... సమాధానపడింది ప్రియంవద.

ఆ మర్నాడు, ఆ మూడోరోజు నాలుగోరోజుకూడా కృష్ణమూర్తిలో, అతని ప్రవర్తనలో మార్పులేదు.

తనపనులు తను చేసుకోవడమేగాక, ప్రియంవద పనులలోకూడా సాయంచేస్తున్నాడు. ప్రియంవద ఏమంటాడో చూద్దాం అన్నట్టు మామూలుగా అతనిపనులు చెయ్యబోతే కొంప మునిగినట్లు గాభరాగా వారించాడు. "నీకెందుకు ప్రియా, ఈ పనులన్నీకూడా, నీ వంట అదీ చాలదా ? నా పనులు నేను చేసుకుంటాను... ఈ పనులన్నీ యిన్నాళ్ళు నీచేత చేయించి దుర్మార్గుడిగా, దుష్టుడిగా ప్రవర్తించింది చాలదా ? ఇంకా నన్ను అలాగే చెలామణి అవమన్నావా ?" అమాయకంగా, నిజాయితీ చూపిస్తూ అన్నాడు.

నాలుగో రోజుతో ప్రియంవదకి గాభరా పుట్టి, మతి పోయింది. ఇంత బుద్ధిమంతుడయి, తనపట్ల యింత గౌరవాభిమానాలు చూపించే మనిషిలో చెడ్డగుణాలు ఎలా ఎంచి చూపడం? అవకాశమే ఈయకపోతే తన నిర్ణయాలని ఎలా ఆచరణలో పెట్టడం?... అదే పెద్దసమస్య అయిపోయింది ప్రియంవదకి. ఆఖరికి ఏం చెయ్యాలో తేల్చుకోలేక సెక్రటరీ శారదాదేవికి ఫోన్ చేసింది సలహాకోసం.

"నాన్సెన్స్! ఏమిటిది! యింతక్రితమే సులోచన, లలిత, పద్మావతి, రాజేశ్వరి వాళ్ళు కూడా ఫోన్ చేశారు. 'కథ అడ్డంతిరిగింది ఏం చెయ్యమంటారు?' ... ఇంట్లో వరస చూస్తూంటే నా కసలే దిక్కు తోచకుండా వుంది... ఆ పైన మీరూ యిలా అంటూంటే వున్న మతి కూడా పోతుంది!... మావారూ అతి బుద్ధిమంతులయిపోయి, నన్నే పనీ చెయ్యనియ్యకుండా, కాలు క్రింద పెట్టనీకుండా, కార్లలో త్రిప్పి, అభిమానంతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు ఈ మూడు రోజులనుంచి. ఇలా యింత మంచిగా వున్న మొగుడి మీద మన నిర్ణయాలని ఎలా అమలులో పెట్టడం అని బుర్ర బద్దలు కొట్టుకుంటున్నాను. మీరేదన్నా సలహా చెపుతారేమో అడుగుదామనుకుంటున్నాను నేను. మీరూ ఇలాంటి స్థితిలో ఇరుక్కోవడం... ఇదేదో విచిత్రంగా వుంది. సరే... ఫోన్‌లో విపులంగా చర్చించడం కుదరదు. రేపు మళ్ళీ అందరం సమావేశం అవుదాం! అక్కడ ఆలోచిద్దాం ఏం చెయ్యవలసిందీ!...."

"నాన్సెన్స్ !..." మళ్లీ అంది శారదాదేవి అందరి నోట సంగతి విని. తాము అనుకున్న ప్లాను ఎవరూ అమలు పరచలేకపోవడం, కథ అడ్డం తిరగడంతో చికాకు ఎత్తింది శారదాదేవికి.

"ఒక్కసారిగా అందరి ఇళ్ళల్లో మగవాళ్లు ఇంత బుద్ధిమంతులయిపోవడం అన్నది అసంభవమైన విషయం ! ఒకే రోజునుంచీ ప్రతీ మగాడు మారిపోవడం చాల విడ్డూరంగా వుంది. ఆలోచిస్తే యిందులో ఏదో మోసం వుందనిపిస్తూంది. మన నిర్ణయాలు, మన సమావేశ సారాంశం వాళ్ళకి తెలిసిపోయివుంటుంది ఎలాగో ! మన ఆట కట్టించడానికి ఎత్తుకు పై ఎత్తు వేసి వుంటారు వాళ్ళు !... మీలో ఎవరన్నా నోరు జారి చెప్పారా మన నిర్ణయాల గురించి..." అందరిని అడిగింది శారదాదేవి.

"అబ్బే !... అసలు ఈ ఊసే ఎవరం ఎత్తలేదు .... వాళ్ళూ మాటవరసకైనా అడగలేదు." ముక్తకంఠాలతో జవాబిచ్చారు అందరూ.

"మరి ! ?... మనసంగతి తెలియకుండానే ముందు కూడబలుక్కున్నట్టుగా, ప్రతి యింట్లో మగాళ్ళు ఒక్కసారిగా బుద్ధిమంతులయిపోయి, మన విలువలని గుర్తించేసి మనకి గౌరవ మర్యాదలు యిస్తున్నారన్నది ఎంతమాత్రమూ నమ్మశక్యంగాని సంగతి !..."

"ఏమో ! ఏమయిందోగాని... పాపం యీ మగాళ్ళు యీ మూడురోజులనించి ఎన్నడూ చేసుకోని పనులు చేసు

కుంటూంటే కాస్త జాలనిపించింది సుమా !...” సులోచన అంది.

“అసలు యిన్నాళ్ళూ మనచేత చాకిరి చేయించుకుంటున్నారని బాధపడ్డామా ?... అదేమిటో ఈ మూడు రోజులనించి చేయించుకోడం లేదని బాధ అనిపించింది. పాపం ఎన్నడూ సూదిలో దారం ఎక్కించలేని ఆయన, స్వయంగా నానాఅవస్థపడిబొత్తాలు కుట్టుకుంటూంటే నవ్వుబదులు జాలి అనిపించింది. కసిక్కిన సూది వేలికి గుచ్చుకుని ‘అబ్బా’ అనగానే యింక వూరుకోలేకపోయాను. మన నిర్ణయాల మాట మరిచి, యిటీయండి, కుట్టిస్తాను, అనేశాను. అయినా కూడా ఆయన వద్దనడంతో నన్నేదో దూరంచేసినట్లు, ఏ పని చెప్పక వెలేసినట్లు ఫీలయ్యాను. మనసు చివుక్కుమనిపించింది” ప్రియంవద అంది.

“అదేనమ్మా ! ఇన్నాళ్ళు ఇంటికి త్వరగా రారని విసుక్కున్నానా ? ఈ మూడు రోజులనించి ఆయన క్లబ్బు మానేసి ఇంటిలో కూర్చుని నా పని కాకుండా బాతాఖానీ కొడ్తూ, నా పెత్తనాలకి అడ్డువస్తున్నారనిపించి ఆ క్లబ్బుకి వెడితేనే బాగుండనిపించింది... పాపం, ముందురోజు క్లబ్బుకెళ్ళారా ?... ఎనిమిదిన్నరకల్లా వచ్చేశారు. మన నిర్ణయం ప్రకారం అప్పుడు అన్నం పెట్టకూడదుగదా. ఏం చేస్తారోనని చూస్తూ ఊరుకున్నాను. నన్ను అన్నం పెట్టమని అడగనైనా అడగకుండా, అలా ఆఫీసుకాగితాలు చూసుకుంటూ కూర్చున్నారు. చూసి చూసి ఆఖరికి వూరుకోలేక తొమ్మిదికి భోజనానికి పిలిచాను. మా అందరి భోజనాలు అయి

పోయాయిగదా, ఆ టైముకి రాకపోవడం నాదేతప్పు. నీవేం మనిషివి కావా, ఒక్కొక్కళ్ళు ఓ టైముకి వస్తే పెడుతూ కూర్చోడానికి. ఇన్నాళ్లూ నీ కష్టసుఖాలు ఆలోచించకుండా అర్ధరాత్రి, అపరాత్రి వచ్చి నిన్నేడిపించుకుతిన్నాను... నీవు గాబట్టి కాపురం చేశావు. ఈ రోజునించి నీ టైముకి వస్తేనే భోజనం చేస్తా... లేకపోతే ఆ రోజు ఉపోవ్యమే నాకు శిక్ష !" అంటూ ఎంత బ్రతిమిలాడినా ఆ పూట ఎంగిలి పడ్డారు కారు. నా ప్రాణం గిలగిల లాడింది. మగాడిని పస్తు పడుకోబెట్టడానికి ఏ ఆడదాని మనస్సు వప్పుతుందమ్మా ! వాళ్ళని ఇలా బాధపెడితే మనకేం ఒరుగుతుంది ! ఆ వుసురు మనకెందుకమ్మా ! మీా సంగతి ఏమోగాని ఈ నిరాకర ణోద్యమాలు అవి నేనేంచెయ్యలేను తల్లీ ! మగాడ్ని దుఃఖ పెట్టి నా వల్లగాదు బాబూ ! ఏదో ఓ గంట కాలక్షేపానికి వస్తున్నానుగాని... ఈ గొడవలన్నీ నాకు బోధపడవు శార దమ్మా !" సుందరమ్మ జాలిగిలి పడిపోయింది.

"నేనూ చెయ్యలేనండోయ్ ! పాపంరాత్రి పన్నెండు గంటలకి వచ్చి తలుపేనా తియ్యమనకుండా వీధి అరుగుబల్ల మీాద చలికి ముడుచుకు పడుకున్న ఆయన్ని ప్రొద్దునే తలుపు తీసి చూసేసరికి సిగ్గుతో ప్రాణం చితికిపోయింది. రాత్రి నేను పరుపుమీాద హాయిగా పవ్వళించాను. ఆయన్ని అలా బయట చలిలో పడుకోపెట్టాను. పాపిష్టిదాన్ని ! నా చేతులు పడ ! మొగాడ్నిఅలా ఏడిపించడం మనకేం న్యాయం ! ఇలాంటి పనులు నావల్లగాదు శారదమ్మా !" పార్వతమ్మకూడ చెప్పేసింది.

"ఏమిటో అనుకున్నానుగాని, మన మనసులు అతి మెత్తనో ఏమిటో! ఆయనలా నా పనిలో సాయంచేస్తుంటే పాపం అనిపించింది. కూరలు తరుగుతూ వేలు కోసుకున్నారు. 'ప్రొద్దుట నీవువండు, రాత్రి నేనువండుతాను. నీవు మాత్రం నాలా ఉద్యోగం చేయడం లేదా? అలాంటప్పుడు నీవొక త్తివే ఇంటిపని ఎందుకు చెయ్యాలి? ఇన్నాళ్లూ నాకీ విషయం ఎందుకు తట్టలేదో!' అని ఎంతో బాధపడుతూ అన్నారు. ఎంతయినా మగాడు వంటా గింటా చేస్తుంటే, చేయించుకోడానికేదో అదోలా వుంది సుమండీ!" లలిత అంది.

"నిజమే. ముందు ఇలా చెయ్యాలి. అలాచేసి వాళ్ళకి బుద్ధివచ్చేట్టు చేద్దామనుకున్నామా? ఆ రోజు నేను ఇంటిలో చెప్పాచెయ్యకుండా, ఓ స్నేహితురాలిని వెంట పెట్టుకుని సినిమా చూసి పది గంటలకి యింటికి వచ్చినా పాపం ఆయన విసుక్కోలేదు సరికదా. 'అవును పాపం ఇంటిలో అస్తమానుపడి వుండి, వుండి విసుగుపుట్టి వెళ్ళివుంటావు. సినిమా బాగుందా!' అంటూ అభిమానంగా పలకరించారు. అంతేకాక పిల్లలకి అన్నాలుపెట్టి, ఆయన తిని, నా కోసం అన్నీ టేబిల్ మీదపెట్టి, వంట ఇల్లంతా సర్ది, కడిగేశారు. అదంతా చూస్తే నేనేదో తప్పు చేసినట్లు చిన్నతనం అని పించి బాధపడ్డాను, మన నిర్ణయాల మాట మరచి." పద్మా వతి అంది.

"నాన్సెన్స్ ! వాళ్ళందరూ మన "నిరాకరణోద్యమానికి, అడ్డు తగలడానికి ఏదో ఎత్తేసుంటారు ! అదంతా నిజమని మీరందరూ బుట్టలో పడుతున్నారు, మన ఆశయాలని, నిర్ణయాలని విస్మరించి ! వాళ్ళ కల్లబొల్లి మాటలు, ప్రేమ కబుర్ల మాయాజాలంలో పడిపోయారు అందరూ..."

"ఇదంతా నటన అని నేను అనుకోను ! వాళ్ళకసలు మన విషయం, మన నిర్ణయాల గురించే తెలిస్తేగదా. ఏదో ఎత్తులు వేశారనుకోడానికి..." ప్రియంవద సందిగ్ధంగా అంది.

"అయితే కూడబలుక్కున్నట్టు ఒకే రోజు మంచి ముహూర్తం చూసుకుని అందరూ మారిపోయారంటారా?"

"ఏమోగాని, వాళ్ళ ఈ మార్పు సహజమైనదే అని పిస్తోంది మన సమావేశం, మన మాటలు, మన నిర్ణయాల సంగతి వాళ్ళకి తెలిసే అవకాశంలేదు... మే మెవ్వరం చెప్ప లేదు... వాళ్ళకేం శ్రవణేంద్రియాలున్నాయా ?... ఇక్కడ మనం, సింహాచలం తప్ప ఎవరూ లేరుగదా.."

"ఆ... సింహాచలంగాని ఎవరితో చెప్పలేదు గదా !" చటుక్కున అంది శారదాదేవి.

"సింహాచలమా . దానికేంతెలుసు దాని మొహం !" సులోచన అంది. "అయినా అడుగుదాం... పిలవండి దాన్ని.. ఏయ్ సింహాచలం ఇటురా !"

అమాయకంగా మొహంపెట్టి వచ్చి నిల్చున్న సింహాచలాన్ని అందరూ ఒకక్షణం చూశారు. "సింహాచలం ! మొన్న మేము, అంటే బుధవారంనాడు ఇక్కడ అనుకున్న

మాటలుగాని ఎవరితోనన్నా అన్నావేమిటి ? ఏ బాబుగార్లన్నా నిన్ను ఏమన్నా అడిగారా ?" శారదాదేవి ప్రశ్నించింది.

"అందరి బాబుగార్లతో నేనందుకు సెపుతానమ్మా. నన్నే బాబుగార్లు అడగలేదు ? ఒక్క మావాడు తప్ప ! ఇంటికాడ మా ఇంటివాడు అడిగితే చెప్పానంతే !"

"ఆ... మీ ఇంటివాడా ? ఏం అడిగాడేమిట ?" పది గొంతుకలు ఒక్కసారిగా ప్రశ్నించాయి.

"మీరంతా ఏటి మాటాడుకుంటారో ఇనమని, ఇని తనకు సెప్పమని, ఆ రోజు సాయంత్రం క్లబ్బుకాడనించి వచ్చి చెప్పాడు. ఆనక ఇంటికెళ్ళాక నన్నడిగినాడు.."

"ఓ !— కొంప ముంచావుగదే !— నీ మొగుడు ఆఫీసర్ల క్లబ్బులో బంట్రోతు కాదూ !—" శారదాదేవి గాభరాగా అడిగింది.

"అవునండమ్మా !"

"ఇంకేం... చూశారా, నే చెప్పలేదూ, వాళ్ళకి మన మాటలు తెలిసే అలా నాటకం ఆడారని !.. మనం ఇలా అర్థాంతరంగా సమావేశం అవడం. వాళ్ళు ఇంటిలో అడిగినా మనం ఎవ్వరూ ఈ సమావేశానికి కారణం చెప్పక పోవడం, అందరం కలసి ఏదో గూడుపుఠాణి చేస్తున్నట్టు వాళ్ళకి అనుమానం తగిలి వాళ్ళంతా చేరి దీని మొగుడిని పంపి, దీని ద్వారా సంగతి రాబట్టారన్నమాట !...మా వారే దీనికి మూలకారకులు అయివుంటారు. ఆ రోజు ఆ కథ చదివి నా ఆవేశం, మన సమావేశం, నేను రహస్యంగా ఈ

సంగతి వుంచడం ఆయనకి అనుమానం కలిగించి వుంటుంది. అందుకే అందరూ క్లబ్బులో చేరి ఈ ఎత్తేసి లాగారు సమాచారం !...

"అయినా దీనికేం తెగులు ! మాదగ్గిర పనిచేస్తూ మా మాటలన్నీ చెపుతావా వాళ్ళకి ?— నిన్నేంచేస్తే పాపం వుంటుంది. ఇలాంటి వెధవపని చేసినందుకు !" ఉగ్రురాలైంది శారదాదేవి.

"నాకేటి తెలుసండమ్మగారు, ఇదంతా రగస్యం చెప్పకూడదని. నాకేటి తెల్సు, అడిగితే సెప్పాను-"

"చాల్లే—ఇంకా సమర్థించుకుంటున్నావు చేసినపని చాలక. నీనించి మా ప్లానులన్నీ తలక్రిందులయిపోయాయి. ఫో. ఇక్కడనుంచి !"

"ఏమిటమ్మగారూ ! తీరికూకుని యీ తగూలాటలు ఎందుకమ్మా ! ఓరుగొప్ప ఏంటి ! మగాడు లేకపోతే ఆడదానికి గడుస్తుందా! ఆడది లేకపోతే మగాడికి గడుస్తుందా ! ఇద్దరూ ఒకరికొకరు వుండాల్సిందేగదా ! దానికోసం హక్కులు, గౌరవాలు, విలూాలూ అంటూ తీరికూకుని మొగాళ్లతో దెబ్బలాటలు ఎట్టుకోడం ఎందుకమ్మా ! నాకు తెలీక అడుగుతాగాని !"

అంతా తెల్లబోయి చూశారు. సృష్టి రహస్యాన్ని లోకరీతిని ఇంత తేలిగ్గా రెండుమాటల్లో చెప్పిన సింహాచలంవంక !